సాక్షి పెద్దపల్లి

శనివారం : 29 : మార్చి : 2025



నిరంతరం నీటి సరఫరా

కాల్వశ్రీరాంపూర్: గ్రామాల్లో నిరంతరం నీరు సరఫరా చేయాలని డీపీవో వీరబుచ్చయ్య ఆదేశించారు. పందిల్లలో రోడ్డు విస్తరణలో పగిలిన తాగునీటి పైపులైన్‌ను ఆయన పరిశీలించారు.



అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పరిశీలన

రామగిరి: ఆర్మీలో ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు రాణీరుద్రమదేవి స్టేడియంలో చేపట్టిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు.



	ఇఫ్తార్ శనివారం (సా॥)	సహర్ ఆదివారం (ఉ॥)
కరీంనగర్ :	6.30	4.53
పెద్దపల్లి :	6.34	4.51
సిరిసిల్ల :	6.29	5.01
జగిత్యాల :	6.34	4.51

న్యూస్‌రీల్

రోజూ తాగునీటి సరఫరా



పార్క్ పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

జ్యోతినగర్/కోల్‌సిటీ(రామగుండం): నగర ప్రజలకు రోజూ తాగునీరు సరఫరా చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ అన్నారు. భీమునిపట్నం, అన్నపూర్ణకాలనీల్లో రక్షిత మంచినీటి సరఫరా ట్రయల్ రన్, భీమునిపట్నం, హెలిప్యాడ్ ట్యాంకులు, ఇందిరమ్మ కాలనీ, దుర్గానగర్‌లోని పార్క్‌లను ఆమె శుక్రవారం పరిశీలించారు. పార్కులు, పట్టణ ప్రకృతి వనాల్లో పచ్చదనం రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, డీఈ షాభాజ్, ఏఈ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

రామగుండం: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన గోదావరిఖని సింగరేణి జవహర్‌లాల్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతి తెలిపారు. అండర్–13, అండర్ –15లో క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రక్రియ ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైన క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

యంత్రాలను వినియోగించాలి



మ్యాప్ పరిశీలిస్తున్న సూర్యనారాయణ

రామగిరి(మంథని): యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి బొగ్గు ఉత్పత్తికి అటంకం కలుగకుండా చూడాలని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గనిని శుక్రవారం ఆయన సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, యంత్రాల వినియోగం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన క్వారీని పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రాజెక్టు ఆఫీసర్ రఘుపతి, ప్రాజెక్టు ఇంజినీర్ టి.చంద్రశేఖర్, మేనేజర్ రామరావు, ఎస్టేట్ అధికారి ఐలయ్య, ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, అధికారులు శ్రీనివాస్, రవీందర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు రూపొందిస్తాం

ముత్తారం(మంథని): ఎస్సారెస్పీ– 22ఆర్ కాలువలోని పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు తయారు చేస్తామని మంథని ఇరిగేషన్ ఈఈ బలరాం తెలిపారు. మైదంబండ నుంచి కేశనపల్లి, ముత్తారం, చివరి ఆయకట్టు అడ్రాబాద్ వరకు ఎస్సారెస్పీ కాలువలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కాలువ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యం మేరకు కాలువలు పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. నిధుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని ఈఈ తెలిపారు. డీఈఈ రాజేంద్రనాథ్, జేఈఈలు నితీశ్, ప్రసన్న, కాంగ్రెస్ నాయకుడు బియ్యాని శివకుమార్ ఉన్నారు.

433 క్వింటాళ్ల పత్తి సేకరణ

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.7,153 ధర పలికింది. కనిష్టంగా రూ.5,009, సగటు రూ.7,069గా ధర నమోదైందని మార్కెట్ సెక్రటరీ మనోహర్ తెలిపారు. మొత్తం 433 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి హెచ్చరించారు. తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనలు పాటించని జిల్లాలోని ఓ స్కానింగ్ సెంటర్‌ను ఇప్పటికే సీజ్ చేశామని ఆమె తెలిపారు. మిగతా 30 స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశామని పేర్కొన్నారు. అందులో 15 సెంటర్లకు నోటీసులిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు శ్రీధర్, వాణిశ్రీ, శ్రీదేవి, రవీందర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజగోపాల్, సరస్వతి, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రేమ.. పరువు.. ఆత్మహత్య.. హత్య!

- దారుణాలకు దారితీస్తున్న కులాంతర ప్రేమలు
- కలకలం రేపుతున్న ప్రేమికుల హత్యలు, ఆత్మహత్యలు
- తాజాగా సాయికుమార్‌ను వెంటాడి నరికి చంపిన వైనం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఉత్తరాది కల్చర్
- మరోసారి పరువు హత్యలపై జోరుగా చర్చ



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ప్రేమ.. త్యాగం నేర్పుతుంది అంటారు. కానీ.. యువతీ, యువకుల మధ్య చిగురించిన ప్రేమ బలికోరుతోంది. సామాజిక సమీకరణాలు కుదరక కులాల కుంపటి రాజుకుంటోంది. గ్రామాల్లో ఈ పోకడ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాము కనీ, పెంచిన పిల్లలు తమకు దక్కకుండా పోతారన్న భయం, పరువు పోతుందన్న ఆందోళనలో తల్లిదండ్రులు తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇవి హత్యల వరకు దారితీస్తున్నాయి. మరోపక్క తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించన్న భయంతో ప్రేమికులు ప్రాణత్యాగాలు చేసుకుంటున్నారు. దురదృష్టవశాత్తూ ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండగా.. సామాజిక అంతరాలకు అద్దం పడుతున్నా యి. వేర్వేరు కులాల యువతీ, యువకులు ప్రేమించుకుంటే వారిపై దాడులు సహజమే అయినా.. అది చంపుకునేదాకా వెళ్తుండడమే ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు ఉత్తరాదికే పరిమితమైన ఈ పోకడ ఉమ్మడిజిల్లాకు పాకడం గమనార్హం.

పంతాలతో కుటుంబాలు నాశనం

సామాజిక కట్టుబాట్లను ఛేదించలేక, అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లల ప్రేమను అంగీకరించలేక పెద్దలు తీసుకుంటున్న తీవ్ర నిర్ణయాలు ఆయా కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. కుటుంబ పెద్ద జైలుకు వెళ్లడంతో ఆర్థికంగా చితికిపోతున్నాయి. వాస్తవానికి ఏ సమాజంలో ఏ పరువు కోసం హత్యలు చేస్తున్నారో.. తరువాత అదే సమాజం ఆయా కుటుంబాలకు అండగా నిలబడని విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో యుక్తవయసులో ప్రేమే సర్వస్వం అంటూ జీవితంలో స్థిరపడక ముందే ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకొని ప్రాణాలు తీసుకుని, తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగుల్చుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని పలు ఘటనలు

- మార్చి 27న పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటకు చెందిన సాయికుమార్‌ను అదే గ్రామానికి చెందిన ముత్యం సదయ్య తన కుమార్తెను ప్రేమిస్తున్నాడని గొడ్డలితో నరికి చంపడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కేవలం కులాలు వేరన్న కారణమే సాయిని చంపేలా చేసింది.
- ఇల్లందకుంట యువకుడు, నిర్మల్ జిల్లాకు చెందిన యువతి ప్రేమించుకున్నారు. పెద్దల ఆమోదం ఉండదన్న ఆందోళనతో మార్చి 17న జమ్మికుంట పరిధిలోని రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.
- మార్చి 6న చొప్పదండికి చెందిన ప్రేమికులు ఇంట్లోవారు తమ ప్రేమను అంగీకరించరన్న భయంతో కరీంనగర్‌లో స్నేహితుడి ఇంట్లో ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నారు.
- 2024 ఏప్రిల్‌లో తాను అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కులాంతర వివాహం చేసుకుని వెళ్లిపోయిందన్న బాధతో సిరిసిల్ల జిల్లాలో ఓ తండ్రి తన కుమార్తెకు పిండ ప్రదానం చేశాడు. తమ ఆశలను అడియాశలు చేసిన కూతురు మరణించిందని ఫ్లెక్సీ పెట్టించడం సంచలనంగా మారింది.
- 2023 నవంబరులో సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలానికి చెందిన ప్రేమికులు విషం తాగి ప్రాణాలు తీసుకున్నారు.
- 2023 ఆగస్టులో కోరుట్ల పట్టణంలో తన ప్రియుడితో పరారయ్యే క్రమంలో ప్రియురాలు తన అక్కనే హత్య చేసి పరారవడం కలకలం రేపింది.
- 2021 ఆగస్టులో మంథనికి చెందిన ఓ ప్రేమ జంటపై యువతి తండ్రి హేయంగా దాడి చేశాడు. ఈ దాడిలో ప్రేమికులు తృటిలో చావు నుంచి తప్పించుకున్నారు.
- 2017లో మంథనిలో మధుకర్ అనే దళిత యువకుడి అనుమానాస్పద మరణం కూడా పరువుహత్యగా ప్రాచుర్యం పొందింది. అనుమానాస్పద మరణం అని పోలీసులు, ప్రియురాలి బంధువులే చంపారని మధుకర్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. దళితసంఘాలు ధర్నా చేయడంతో మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించారు. అప్పట్లో ఇది జాతీయస్థాయిలో చర్చానీయాంశంగా మారింది. ఈ కేసు ఇంకా తేలాల్సి ఉంది.
- 2016లో తిమ్మాపూర్‌లోని ఓ గుడిలో ప్రేమ వివాహం చేసుకునేందుకు పీటల మీద కూర్చున్న జంటపై యువతి బంధువులు దాడి చేశారు. పెళ్లికూతురు కళ్లముందే పెళ్లి కొడుకును విచక్షణా రహితంగా పొడిచి చంపడం కలకలం రేపింది.

ఆలోచన తీరు మారాలి



కులం అహంకారంతో జరిగే దారుణాలతో ప్రాణాలుపోతున్నాయి. టెక్నాలజీలో ముందున్న మనం ఆధునికంగా ఆలోచించలేక పోతున్నాం. ఉన్నత చదువులు చదువుకునే..యువత కూడా ప్రేమించుకోవడం.. కాదన్నారని ప్రాణాలు తీసుకోవడం తగదు. ఈ ఘటనలకు కేవలం ఆలోచన తీరే కారణం. తీరుమారితే విపరీత ధోరణులు మారుతాయి. – ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, సోషియాలజీ విభాగం అధిపతి, శాతవాహన వర్సిటీ

కుల వివక్షపై అవగాహన కల్పించాలి



సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నా కుల, మత భేదాలు గ్రామాల్లో అలాగే కొనసాగుతున్నాయి. కులాల మధ్య వైరుధ్యాలు పెరిగేలా ప్రభుత్వాలు కులాల ఆధారంగా ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజల మధ్య దూరాలను పెంచుతున్నాయి. పిల్లల ప్రేమ కన్నా పరువు, పట్టింపులే ఎక్కువ అనే భావన తొలిగేలా, కులవివక్షపై ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– కల్లెపల్లి ఆశోక్, కేవీపీఎస్

శివాలయం అభివృద్ధికి రూ.6కోట్లు ఇవ్వాలి

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలోని జనగామ పురాతన శివాలయం అభివృద్ధికి రూ.6 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి లేఖలు అందజేశారు. రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఆర్టిజెన్‌లను ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్ డిపెండెంట్ల మారుపేర్ల బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.



సీఎంకు లేఖ అందిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

ఇఫ్తార్‌తో సోదరభావం



ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి(పెద్దపల్లి): రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసే ఇఫ్తార్‌లతో మతసామరస్యం, సోదరభావం పెంపొందుతాయని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన మాట్లాడారు. నాయకులు నర్సింహయాదవ్, సయ్యద్ మస్రత్, వేణుగోపాలరావు, లోక జలపతిరెడ్డి, పోట్టాల శంకర్, కొమ్ము పోచాలు, బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు రావడం అభినందనీయం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో హిందీ భాష అమలుకు స్వర్ణశక్తి అవార్డు రావడం అభినందనీయమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత అన్నారు. ప్రాజెక్టు పరిపాలన భవనంలో అధికారిక భాష అమలు కమిటీ త్రైమాసిక సమావేశం శుక్రవారం జరిగింది. హిందీ వినియోగం, ప్రచారం, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం సాధించడానికి చేసే ప్రయత్నాల గురించి సీనియర్ అధికారులతో ఆయన చర్చించారు. హిందీ మాట్లాడడాన్ని ప్రోత్సహించడంలో అధికార భాషా విభాగం చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. సౌత్ రీజియన్ రీజినల్ హెచ్ఆర్ హెడ్ ఎస్ఎన్ పాణిగ్రాహి మాట్లాడుతూ.. ఎన్టీపీసీ ఉద్యోగుల్లో హిందీ భాషపై ఆసక్తి, అవగాహన పెంచడానికి నాటక ప్రదర్శన నిర్వహించాలన్నారు. అనంతరం వర్చువల్ విధానంలో న్యూఢిల్లీలోని అధికార భాషా విభాగం అధిపతి అతర్‌సింగ్‌గౌతమ్ కమిటీ సభ్యులకు మార్గనిర్దేశం చేశారు. అధికారిక భాష –2024–25 వార్షిక పత్రికను విడుదల చేశారు. తెలంగాణ జనరల్ మేనేజర్ (ఓ అండ్ ఎం) దాస్, జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) సింఘా రాయ్, అధికారులు, పాల్గొన్నారు.




మ్యాగజిన్ ఆవిష్కరిస్తున్న అధికారులు

రైతు నేతలపై కేసులు ఎత్తివేయాలి

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు కలిగేలా గోడౌన్లు, మార్కెట్ యార్డులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ రైతులను మోసగిస్తోందని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెలుతురు సదానందం ధ్వజమెత్తారు. కలెక్టరేట్ ఎదుట సంఘం నాయకులు వెంకన్న, మల్లన్న, భీమన్న, చంద్రయ్య తదితరులతో కలిసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు.పంజాబ్ రాష్ట్రంలో రైతుసంఘాల నేతలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తేయాలని కోరారు. నాయకులు గుమ్మడి కొమురయ్య, విశ్వనాథ్, శ్రీనివాస్, సదానందం, రత్నకుమార్, మల్లేశ్, రామన్న, చంద్రన్న, మల్లన్న, రాయమల్లు పాల్గొన్నారు.

'ఫ్రై' డే



మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు(డిగ్రీల సెల్సియస్)

జిల్లా	28	27	26
కరీంనగర్	40.1	40.2	40.0
జగిత్యాల	40.6	40.9	40.6
పెద్దపల్లి	40.8	40.8	41.4
సిరిసిల్ల	39.5	40.2	39.8



పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్(రామగుండం): జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. భానుడి ప్రతాపం ప్రజలపై భారీగా చూపిస్తున్నాడు. శుక్రవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రామగిరి మండలంలోని సింగరేణి ఆర్జీ–3 ముల్కలపల్లిలో గరిష్టంగా 41.4 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 35.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని మరో 17 ప్రాంతాల్లోనూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వేడిమికి భయపడి జిల్లావాసులు ఇళ్లనుంచి బయటకు రాలేకపోయారు. ఉదయం నుంచే ఎండలు దంచికొట్టాయి. మేనాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

అనుమతికి మించి..





కొత్తపల్లి నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు , అడ్డుకున్న గ్రామస్తులు

- ఇటుక బట్టీ.. చెరువు మట్టి.. అక్రమ దందా
- ఫిర్యాదుతో 95 వేల మెట్రిక్ టన్నుల మట్టి సీజ్ చేసిన అధికారులు

పెద్దపల్లిరూరల్: ఇటుక బట్టీలకు అవసరమైన చెరువు మట్టిని కొందరు దళారులు అక్రమ దందాగా ఎంచుకున్నారు. చీకటిమాటున తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రూ.వేలు, రూ. లక్షలు కాదు.. ఏకంగా రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. గోరంత అనుమతి పొంది.. కొండంత మట్టి తవ్వేస్తున్నారు.

అనుమతి కన్నా.. అధికంగా తోడేశారు..!

2022 మేలో 70,216 మెట్రిక్ టన్నులకు జిల్లాలోని ఆరు ఇటుక బట్టీల యజమానులు అనుమతి పొందారు. అనుమతి కన్నా అధికంగా తోడేస్తున్నారని అప్పట్లో అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రంగ ప్రవేశం చేసిన అధికారులు.. 1,15,510 మెట్రిక్ టన్నులు తవ్వినట్లు నిర్ధారించి.. 95,294 మెట్రిక్ టన్నులు అధికంగా వెలికితీసినట్లు గుర్తించారు. ఇందుకు దాదాపు రూ.2కోట్ల వరకు జరిమానా విధించారు. ఆ సొమ్ము చెల్లించి అదనంగా తవ్విన మట్టిని తీసుకెళ్లాలని నోటీసులు జారీ చేశారు.

జరిమానా చెల్లించకుండానే..

పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో అధికారులు సీజ్ చేసి ఉంచిన మట్టి డంపులోంచి కొద్దిరోజులుగా కొందరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. టిప్పర్లతో ఇబ్బంది కలుగుతుందని కొందరు గ్రామస్తులు వాటిని అడ్డుకోవడంతో అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. దీంతో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు.. ఇటీవల గ్రామంలో చేపట్టిన ఓ ఉత్సవానికి రూ.4 లక్షల వరకు విరాళంగా ఇచ్చినట్లు జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మరిన్ని టిప్పర్లు, జేసీబీలను తెప్పించి మట్టి తరలింపులో వేగం పెంచారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి గతంలో తన ఫిర్యాదుతోనే సీజ్ చేశారని, జరిమానా చెల్లించకుండా మట్టి తరలిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు.

నిబంధనలు బేఖాతరు..

నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోపే మట్టి తరలించాలి. కానీ, ప్రతీరోజు అర్ధరాత్రి ప్రారంభించి వేకువజాము వరకూ రవాణా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



విచారణ జరుపుతున్న అధికారులు

జేసీబీ, మట్టికుప్పలు సీజ్

కొత్తపల్లి నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి వ్యవహారం రచ్చకెక్కడంతో మైనింగ్ అధికారులు శుక్రవారం ఆ నిల్వలు పరిశీలించారు. ఓ జేసీబీ, మట్టి కుప్పలను సీజ్ చేశారు. జరిమానా చెల్లించిన తర్వాతే మట్టి తరలింపునకు అనుమతినిస్తామని, అప్పటిదాకా నిఘా ఉంచాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

అవసరమైతే కోర్టుకెళ్తా



మట్టి అక్రమ తరలింపుతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. గతంలో చేసిన ఫిర్యాదుతో సీజ్‌చేసి జరిమానా విధించారు. ఇప్పుడు జరిమానా చెల్లించకుండానే మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకు కొందరు అధికారుల అండ ఉంది. అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తా.

– జి.సురేశ్‌రెడ్డి, బీజేపీ నేత

జరిమానా చెల్లించాల్సిందే


కొత్తపల్లిలో సీజ్ చేసిన మట్టిని సీజ్ చేశాం. జరిమానా విధించాం. ఆ జరిమానా చెల్లించిన తర్వాతే మట్టి తరలించాలి. మాకు అందిన ఫిర్యాదుతో సత్వరమే విచారణ జరిపి జేసీబీ, మట్టి కుప్పలు సీజ్‌చేశాం. అక్రమంగా మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, పెద్దపల్లి

ప్రతిపాదనల్లోనే హరిత హోటల్

- రెండేళ్లక్రితం పరిశీలించిన అధికారులు
- నేటికీ కార్యరూపం దాల్చని వైనం

గోదావరిఖని: పెద్దపల్లి – మంచిర్యాల జిల్లాలను కలుపుతూ గోదావరి నదిపై నిర్మించిన రెండు వంతెనలు.. ఆ పక్కనే సమ్మక్క – సారలమ్మ గద్దెలు.. నిత్యం వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా నిర్మించిన ఘాట్లు.. తీరంలోనే ఎత్తయిన శివుని విగ్రహం.. ఇవన్నీ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి వన్నె తెచ్చి పెడుతున్నాయి.. సుందిళ్ల బ్యారేజీలో నీటి నిల్వలు పెంచితే బ్యాక్‌వాటర్‌లో అందుబాటులోకి వచ్చే బోటింగ్ సౌకర్యం.. ఇది పర్యాటకులను ఆకర్షించే ప్రక్రియ. వీరికి విడిది సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో శారదానగర్ సమీపంలో హరిత హోటల్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆ శాఖ అధికారులు రెండేళ్ల క్రితం ఇక్కడకు వచ్చారు. హోటల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి వెళ్లిపోయారు. కానీ, ఆ ప్రతిపాదనలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. హరిత హోటల్ నిర్మాణం పూర్తయితే పర్యాటకులు అత్యధికంగా తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. రాజీవ్‌రహదారి పక్కనే హరిత హోటల్ నిర్మిస్తే.. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రజలకు కూడా అనుకూలంగా ఉంటుందని, మంచి భోజన, వసతి అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు.



రామునిగుండాలు

రామునిగుండాలు వద్ద భారీ విగ్రహం

రామునిగుండాలు గుట్టపై సుమారు 152 అడుగుల ఎత్తుతో పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకోసం 60 అడుగుల వెడల్పుతో సుమారు కిలోమీటరు పొడవున రోడ్డు నిర్మిస్తున్నారు. దీనికోసం రూ.2కోట్లు ఖర్చు చేయనున్నారు. పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. దీంతో రామునిగుండాలుకు కూడా పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

రాజీవ్ రహదారిపై రద్దీ..

మంచిర్యాల జిల్లా కోటపల్లి శివారులోని అర్జునగుట్ట వద్ద వంతెన నిర్మించడంతో రాజీవ్ రహదారిపై ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన ప్రయాణిలకు ఇదే అనువైన మార్గం. అయితే, తమ పనుల్లో అనూహ్యంగా ఆలస్యమైతే.. రోడ్డు వెంట ఉండే హరితహోటల్‌లో సేదతీరేందుకు అవకాశం ఉంటుంది. ఈక్రమంలో ఈప్రాంతంలో హరిత హోటల్ నిర్మాణం అత్యంత అవసరమని అంటున్నారు.

పర్యాటకాభివృద్ధికి కృషి

గోదావరి తీరంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తాం. అసెంబ్లీలో కూడా ఈ విషయం గురించి మాట్లాడా. సింగరేణి సహకారంతో సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో భక్తులు, పర్యాటకులు బసచేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం సింగరేణి యాజమాన్యం రూ.3 కోట్లు కేటాయించింది.

– మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

క్లుప్తంగా

క్యాంటీన్లలో చపాతీ మిషన్లను పునరుద్ధరించాలి

గోదావరిఖని: ఏడేళ్ల క్రితం కొనుగోలు చేసిన చపాతీ యంత్రాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన స్ట్రక్చరల్ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. గనుల్లోని క్యాంటీన్లలో చపాతీని అల్పాహారంగా అందజేయాలన్నారు. జీడీకే-1గనిలో చైర్‌కార్ సిస్టం పొడిగించాలన్నారు. జీఎం ఆఫీస్ గ్రౌండ్‌లో ఓపెన్ జీఎం ఏర్పాటు చేయాలని, సింగరేణి ఏరియా ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం రేడియాలజిస్ట్ లేక మూలన పడిందని, ఔట్‌సోర్సింగ్ ద్వారానైనా రేడియాలజిస్టును నియమించాలన్నారు. రెండు స్విమ్మింగ్‌పూల్‌లకు బోర్లు వేయాలని, జీడీకే-11గనిలో లైన్‌మెన్ మొఖద్దాం, సపోర్ట్‌మెన్ మొఖద్దాం పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో టెక్నీషియన్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో సెక్యూరిటీ పోస్టుల వద్ద చలువ పందిళ్లు వేయాలన్నారు. స్ట్రక్చరల్ సమావేశంలో యాజమాన్యం తరఫున ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, యూనియన్ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్ తితరులు పాల్గొన్నారు.

రైల్వే హైట్‌గేజ్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

- నిలిచిన వాహనాల రాకపోకలు

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి రైల్వేగేట్ వద్ద పైన ఉన్న హైట్‌గేజ్‌కు చొప్పదండి నుంచి కరీంనగర్‌కు వస్తున్న రెడ్‌మిక్స్ ట్యాంకర్ తాకడంతో ఐరన్‌పోల్ విరిగిపోయింది. ఈ ఘటన ఉదయం 8 గంటలకు జరగగా.. వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఐరన్‌పోల్ విరిగి రోడ్డుపై వేలాడుతుండటంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే క్రేన్‌సాయంతో మరమ్మతు చేసి అరగంట అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎలక్ట్రికల్ ట్రెన్లు నడిచేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్‌లైన్ రక్షణ కోసం హైట్‌గేజ్ ఏర్పాటు చేస్తారని రైల్వే అధికారులు తెలిపారు. ట్యాంకర్ డ్రైవర్ అవగాహన లేకుండా వేగంగా నడపడటంతో హైట్‌గేజ్ పోల్ విరిగిందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన ఎండీ అహమద్ (51) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారని బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. అహమద్ ఈనెల 26న తన స్నేహితుడు శ్రీనివాస్‌తో బైక్‌పై విధులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పెద్దపల్లి మండలం రాఘవాపూర్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిని కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించారు. అహమద్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మరణించాడు. మృతుడి భార్య జులేకబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువకుడికి రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: బాలికను ప్రేమిస్తున్నానని వేధించిన కేసులో రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఫోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి జి.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని ఓ బాలికను ఎండీ అంకూస్ ప్రేమిస్తున్నాంటూ వెంటపడ్డాడు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ బాలికను మానసికంగా వేధించాడు. దీంతో బాలిక పోలీస్‌స్టేషన్‌లో 2019లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడైన అంకూస్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

కిలోమీటరు పొడవు.. 25 పిల్లర్లు

- గోదావరిపై మరోవంతెన నిర్మాణానికి రూ.125 కోట్లు మంజూరు
- పెద్దపల్లి – మంచిర్యాల జిల్లాల మధ్య వారధి పనులు ప్రారంభం


గోదావరి తీరంలో కొనసాగుతున్న ర్యాంపు పనులు

మంథని: మంచిర్యాల – పెద్దపల్లి జిల్లా మధ్యలోని గోదావరి నదిపై మరో హైలెవల్ వంతెన పనులు మొదలయ్యాయి. ఇందుకోసం జిల్లాలోని మంథని సమీప గోదావరి నుంచి మంచిర్యాల జిల్లా శివ్వారం వరకు కిలోమీటరు పొడవుతో 25 పిల్లర్లతో వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం రూ.125 కోట్లు ఇటీవల మంజూరు చేసింది. గత సంవత్సరం డిసెంబర్‌లో పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఇటీవల అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీ.. నాలుగు రోజులుగా పనులు చేస్తోంది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే.. రెండు జిల్లాల మధ్య దూర భారం తగ్గుతుంది.

రెండు జిల్లాల్లో సంబురాలు..

మంథని సమీప గోదావరిపై వంతెన నిర్మాణం కోసం పెద్దపల్లి–మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో వారధి పనులు ప్రారంభం కావడంతో తమ కల నెరవేరబోతుందని సంబురం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నుంచి మంచిర్యాల జిల్లా శివ్వారం, పొనూరు, వేలాల, సోమన్‌పల్లికి వెళ్లేందుకు బస్సు మార్గంలో అయితే గోదావరిఖని, ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్ మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇందుకోసం సుమారు 60 కి.మీ. – 70 కి.మీ. వరకు ప్రయాణిస్తున్నారు. అలాగే చెన్నూర్‌కు గోదావరిఖని, జైపూర్ మీదుగా ప్రయాణం చేస్తున్నారు. మరోవంతెన నిర్మాణం పూర్తయితే మంథని నుంచి శివ్వారం ఆరు కిలో మీటర్లు, చెన్నూర్ వరకు 26 కిలో మీటర్లు మాత్రమే దూరం ఉంటుంది. రెండు జిల్లాలకు చెందిన అనేక మంది రైతుల పంట పొలాలు మంచిర్యాల జిల్లావైపు ఉన్నాయి.

జాతీయ రహదారులకు అనుసంధానం

గోదావరిపై మరోవంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల– పెద్దపల్లి జిల్లాకు ప్రధానం చెన్నూరు పట్టణానికి దూరం తగ్గడమే కాకుండా జాతీయ రహదారులకు సమీపంలోనే అనుసంధానం అవుతుంది. అంతర్ రాష్ట్ర వంతెన నిజామాబాద్–జగ్దల్‌పూల్ జాతీయ రహదారి కేవలం 25 కిలో మీటర్ల దూరంలోనే ఉంటుంది. అంతేగాకుండా అన్నారం బ్యారేజీ, వంతెన 22 కి.మీ., అలాగే కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు పది కి.మీ. ధ్యలోనే వంతెన నిర్మిస్తున్నారు. అలా రెండు జాతీయ రహదారులకు మధ్య గోదావరి నదిపై మంథని– శివ్వారం వంతెన పూర్తయితే జిల్లా, రాష్ట్రాల మధ్య రాకపోకలు మెరుగుకానున్నాయి. మంచిర్యాల జిల్లా వేలాల కేవలం ఆరు కి.మీ. దూరంలోనే ఉంటుంది. దీంతో పుణ్యక్షేత్రానికి జిల్లానుంచి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఆలయాల సమీపంలోనే..

గోదావరి తీరంలోని శ్రీగౌతమేశ్వర, రామాలయం, సరస్వతీ దేవాలాయలకు అటు వైపుగా వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు. గోదావరిపై నిర్మించే వంతెన పనులు కొత్త శ్మశానవాటిక పక్క నుంచి, దేవాలయాలయ సమీపం నుంచి పంట పొలాల మీదుగా, మంథని నుంచి గోదావరి వచ్చే చిన్నకల్వర్లు వద్ద కలుపనున్నారు. భూసేకరణ సమస్య పెద్దగా లేకుండా వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.


మంథని వద్ద గోదావరి నది

నిబంధలనకు లోబడి పనులు

మంథని నుంచి శివ్వారం వరకు వంతెన నిర్మాణానికి అగ్రిమెంట్ పూర్తిచేసుకున్న ఏజెన్సీ ర్యాంపు పనులు మొదలు పెట్టింది. అన్నిరకాల పరీక్షలు, డిజైన్ పూర్తయిన తర్వాత పిల్లర్ల నిర్మాణం చేపడతారు. నిబంధనలకు లోబడి పనులు నిర్వహిస్తారు.

– జఫార్, డీఈఈ, ఆర్ అండ్ బీ, మంథని

అభివృద్ధికి ఆస్కారం



మంథని వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణంతో రెండు జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. అటువైపు నుంచి ఆ జిల్లావాసుల వివిధ పనులు కోసం మన జిల్లాకు రావడం మొదలవుతుంది. దీంతో మంథనిలో వ్యాపార, వాణిజ్య వ్యవస్థ మరింత బాగుపడుతుంది. సమీపంలో ఉన్న శ్రీపాదకాలనీకి మేలు జరుగుతుంది.

– బెజ్జంకి డిగంబర్, శ్రీపాదకాలనీ, మంథని

సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు


నూతన కార్యవర్గం

సుల్తానాబాద్(పెద్దపల్లి): మండల కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 41 మంది సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. పడాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అధ్యక్ష స్థానానికి మేకల తిరుపతి రెడ్డి, పడాల శ్రీరాములు పోటీపడగా మేకల తిరుపతిరెడ్డి 31 ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా అవునూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బోయిని భూమయ్య, సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా బొబ్బిలి శ్యాం, లైబ్రరీ కార్యదర్శిగా గుడ్ల వెంకటేశ్, మహిళా ప్రతినిధిగా పి.సంధ్యారాణి ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, భూసారపు బాలకిషన్‌ప్రసాద్, మాదూరి ఆంజనేయులు, ఆలూరి శ్రీనివాసరావు, ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి, టీకే సత్యనారాయణ, జోగుల రమేశ్, ఆవుల శివకృష్ణ, ఆరెల్లి రాము, వంగల యుగేందర్‌రెడ్డి, రుద్రారపు నర్సయ్య, దొడ్డిపల్లి సూర్యనారాయణను ఎన్నుకున్నారు.

కొదురుపాకలో దొంగతనం

- ఐదు తులాల బంగారం.. 24 తులాల వెండి చోరీ

బోయినపల్లి(చొప్పదండి): అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు తెచ్చుకోవడానికి ఇంటికి గడియపెట్టి వెళ్తే తిరిగి వచ్చే సరికి దొంగతనం జరిగింది. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాలు. కొదురుపాకకు చెందిన సట్ట జలజ కోడిగుడ్ల కోసం ఇంటికి గడియపెట్టి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లోని రెండు బీరువాల తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా వద్దకు వెళ్లి చూడగా అందులో ఉన్న తన అత్తమ్మ బంగారం కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 5 తులాల 9 గ్రాముల బంగారు నగలు, 24 తులాల వెండి ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్, డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు.


వివరాలు తెలుసుకుంటున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై

25 రోజులకు ఇంటికి చేరిన మృతదేహం

గన్నేరువరం: గల్ఫ్‌లో మృతి చెందిన లింగంపల్లి మొండయ్య మృతదేహం 25రోజులకు శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి మొండయ్య 17ఏళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 3వ తేదీన అక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కొడుకు క్రాంతి, గ్రామ మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ, రజక సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ మార్చి 5న కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ని కలిశారు. ఆయన చొరవతో 25రోజుల నిరీక్షణ అనంతరం మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరుకుంది. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియలకు గ్రామస్తులతో సమీప గ్రామ ప్రజలు తరలివచ్చారు.


రోదిస్తున్న కుటుంబసభ్యులు

దొంగతనానికి యత్నించిన వ్యక్తికి ఆరు నెలల జైలు

జగిత్యాలజోన్: రైతుల తోటల వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌ను దొంగలించేందుకు యత్నించిన నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ జగిత్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోహిర్కర్ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కథనం ప్రకారం.. జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన అనిల్‌కు చెందిన విద్యుత్ మోటార్‌ను దొంగిలించేందుకు యత్నించిన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఉత్పల్లికి చెందిన ఫిరాజ్‌ను చుట్టు ప్రక్కల తోటల రైతులు కలిసి పట్టుకున్నారు. దీనిపై రైతులు జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై సదాకర్ కేసు నమోదు చేసుకుని, నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఫిరాజ్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

కోడె మొక్కులు... కుంకుమ పూజలు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



విద్యుత్ వైరును పట్టుకొని వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి: వెన్నునొప్పి భరించలేక ఓ వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ వైరును పట్టుకొని గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. రాయపట్నం గ్రామానికి చెందిన గొల్ల సత్తయ్య(48) ఐదేళ్లుగా వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక ఆత్మహత్య శరణ్యమని భావించి ఇంటి ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరును పట్టుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన కూలీలు



చికిత్స పొందుతున్న కూలీలు

పెద్దపల్లిరూరల్: చీకురాయి గ్రామ సమీపంలో కొనసాగుతున్న రైల్వేలైన్ బైపాస్ పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన ఇద్దరు వలస కూలీలు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ కూలీలు గోవింద్‌కుమార్, బ్రిజేశ్ కుమార్‌ను సదరు కాంట్రాక్టర్ గోప్యంగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాంట్రాక్టర్ తన నిర్లక్ష్యాన్ని బయటకు పొక్కకుండా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నట్లు తెలుస్తోంది.

వైరస్‌తో కోళ్ల మృతి



గంగాధర: గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి శివారులోని కోళ్లఫారంలో వైరస్‌సోకి శుక్రవారం వందలాది కోళ్లు మృతి చెందాయి. వాతావరణంలో మార్పులతో పాటు, ఆర్డీ వైరస్‌తో కోళ్లు మృతి చెందుతున్నాయని ఫారం యజమాని ఇప్పలపల్లి నర్సయ్య పేర్కొన్నాడు. ఇప్పటి వరకు ఐదారువేల కోళ్లు మృతి చెందాయన్నాడు. ఐఎల్‌టీ, వీవీఎన్‌డీ వైరస్ సోకడంతో ప్రస్తుతం కోళ్లు మృతి చెందుతున్నాయని పశువైద్యాధికారి సందీప్‌రెడ్డి తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డుకు ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం సినీ ఫక్కీలో జరిగిన ఘటనలో దుండగులు రూ.1.50 లక్షలు చోరీ చేసి బైక్‌పై పారిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. అయిలాపూర్‌కు చెందిన చింతకింది శ్రీహరి శుక్రవారం బ్యాంకు నుంచి రూ,1.50 లక్షలు డ్రా చేసి తన బైక్‌లోని ట్యాంక్ కవర్ ఉంచాడు. తను పార్క్ చేసిన బైక్ వద్ద మరో బైక్ ఉండటంతో బైక్‌ను జరిపేందుకు ప్రయత్నించే క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ.100 నోటును పడవేశాడు. మీనోటు పడిపోయింది చూడట్లేదా? అని శ్రీహరితో అనటంతో ఆ వంద నోటు తీసుకునేందుకు శ్రీహరి కిందికి వంగాడు. అదే క్రమంలో బైక్ ట్యాంకు కవర్‌లో ఉన్న రూ.1.50 లక్షల నగదును ఇద్దరు దుండగులు తీసుకొని బైక్ పై పారిపోయారు. దుండగులు పారిపోతున్న దృశ్యాలు పట్టణంలోని సీసీ కెమెరాల్లో కనిపించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో పురుడుపోసిన 108 సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): పురిటి నొప్పులతో తల్లడిల్లుతున్న ఓ గర్భిణికి సకాలంలో పురుడు పోశారు 108 సిబ్బంది. సప్తగిరికాలనీకి చెందిన బండి వెంకటేశ్ కూలీ పనులు చేసుకుంటున్నాడు. అతడి భార్య పద్మ నెలలు నిండు గర్భిణి. శుక్రవారం వేకువజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఆటోలో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే నొప్పులు అధికమమయ్యాయి. ఆమె తల్లడిల్లుతుండగా ఆందోళన చెందిన భర్త.. 108 సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన ఈఎంటీ రవీందర్, పైలట్ రాజేందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో తరలించే పరిస్థితి లేకపోవడంతో ఆటోలోనే గర్భిణాకి పురుడు పోశారు. ఆమె పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం శిశువుతోపాటు బాలింతను జీజీహెచ్ తరలించగా వైద్యులు శిరీష, శివరంజని చికిత్స అందించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉండడంతో కుటుంబసభ్యులు 108 సిబ్బందిని అభినందించారు.


తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల సోదాలు

మంథని: సూరయ్యపల్లి రైస్‌మిల్లులో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సీఎమ్మార్ ప్రకారం రాష్ట్రంలోని పలు రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలపై అనుమానాలు ఉన్న జాబితా ఆధారంగా మంథనికి చేరుకున్నారు. ఈక్రమంలోనే సూరయ్యపల్లి రైస్‌మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. మిల్లులో 41,365 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉండాల్సి ఉండగా అక్కడ రైస్‌మిల్లులో ధాన్యం లేదని గుర్తించారు. కాగా, తాను లీజు తీసుకున్న గంగాపురి సమీపంలో ధాన్యం నిల్వ ఉందని యజమాని చెప్పడంతో అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అక్కడ 9,689.08 క్వింటాళ్ల ధాన్యం నిల్వ మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా ధాన్యం నిల్వలు అందుబాటులో లేవని తేల్చారు. నిర్దేశించిన ప్రకారం ప్రభుత్వానికి చెల్లింపులు చేయాల్సి ఉంటుందని, కానీ, అలా చేయక పోవడంతో సోదాల్లో వెలుగుచూసిన అంశాలను కమిషనర్‌కు నివేదిస్తామని స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి తెలిపారు. రూ.కోట్ల విలువైన ధాన్యం అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. తనిఖీల్లో ఓఎస్డీ ప్రభాకర్, ఎస్ఐ జంగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.


సోదాలు చేస్తున్న అధికారులు

వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకే 'జై బాపు.. జై భీమ్'


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న రాఘవరెడ్డి, నాయకులు

- తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి

రామగిరి(మంథని): వాస్తవాలను ప్రజలకు తెలియచేప్పేందుకే జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టామని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి తెలిపారు. సెంటినరీకాలనీ శ్రీపాదభవన్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్‌ఆధ్వర్యంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమన్నారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి వివరించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానిస్తున్న తీరు గురించి వివరించాలన్నారు. మంథని ముద్దుబిడ్డ దుద్దిళ్ల శ్రీపాదరావు అందించిన సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుద్దిళ్ల శ్రీనుబాబు, రొడ్డ బాపన్న, గంట వెంకటరమణారెడ్డి, ఆరెల్లి దేవక్క, తోట చంద్రయ్య, కండె పోచం, కోట రవీందర్‌రెడ్డి, వనం రాంచందర్‌రావు, బర్ల శ్రీనివాస్, కాటం సత్యం, ముస్త్యాల శ్రీనివాస్, బంక్ మల్లేశ్, సందెల కుమార్, మాదాసు శ్రీనివాస్, కెక్కర్ల స్వరూప, జాగిరి రజిత తదితరులు పాల్గొన్నారు.

కుమారుడికి కిడ్నీ ఇచ్చేందుకు తండ్రి నిర్ణయం

మేడిపల్లి: భీమారం మండలం మన్నేగూడెంకు చెందిన మహేందర్‌కు కిడ్నీ ఇచ్చేందుకు తండ్రి నిర్ణయించుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న మహేందర్‌కు కిడ్నీ ఇచ్చేందుకు డోనర్ దొరకకపోవడంతో తన తండ్రి భూమయ్య కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో గ్రామస్తులు అభినందించారు. అయితే కిడ్నీ మార్పిడికి రూ.5లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో నిరుపేద కావడంతో మాజీ సర్పంచ్ తేలు నరేశ్ దృష్టికి విషయం తీసుకపోగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విషయం తెలిపారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సకు రూ.5లక్షలు ఎల్‌వోసీ మంజూరు చేయించి చికిత్సకు సహకరించారు.